# దొరసాని చీర

రాజద్వారంలా వున్న పెద్దరువాజ దాటి వాకిట్లో కడుగుపెట్టింది పుల్లమ్మ. "చాకల్దాన్నవ్వా" అని కేకేసి బొడ్లో దోపి వున్న పేగును తీసి చేత్తో పట్టుకుంది లోపల్నుంచి దొరసాని తెచ్చే అన్నం కొరకై ఎదురుచూస్తుంది. ఎంత సేపటికీ రాకపోయేసరికి అసహనంగా అటూ ఇటూ కదిలింది లోపలికి మిటుకరించి చూసింది. ఎవరూ బయట కొచ్చే జాడ కనిపించడం లేదు. "దొర్సానీ! జెప్పనన్న మెయ్యంద్రి పొద్దుపోతంది ఇంక సానిండ్లు దిరుగాలే" అని అరిచి ఎదిరిచూస్తుంది ఇంతలో స్టీలు గిన్నెలో అన్నం పట్టుకొని "ఏం వడావు జేస్తవే ఎందుకో బాగ కేకలేత్తన్నవేంది" అని తిట్టుకుంటూ బయటకొచ్చింది దొర భార్య లక్ష్మీదేవి.

ఆమె తిట్టే తిట్లు పుల్లమ్మకు వినబడటం లేదు. ఆమె కట్టుకున్న చీర దిక్కే కన్నార్పకుండా చూస్తుంది. ఆమె వచ్చి అన్నం వేయడా నికరుగుపై నిల్చున్నది కూడా గమనించే స్థితిలో లేదు...పరధ్యానంగా వున్న పుల్లమ్మతో—"ఏం జూత్తన్నవే పల్లి? అన్నం దీసుకో" అ ది లక్ష్మీదేవి—ఆ మాటలతో ఈ లోకంలో కొచ్చిన పుల్లమ్మ అరుగు అంచుల దగ్గరికెళ్ళి "ఏం లేద్దొర్సాని" అని పేగుచాపింది అందులో అన్నం వేసి లక్ష్మీదేవి - ఇయ్యాల్లీ చీరే ఉతుక్కరావాలె. ఉడుక పెట్టద్దు. సబ్బిత్త పై లంగుతుక్కరా.. అని లోపలికెళ్ళింది.

లక్ష్మీదేవి కనపడకుండా పొయ్యేంత వరకూ చీర దిక్కే కన్నార్పకుండా చూసి బయటకొచ్చింది పుల్లమ్మ. పరధ్యానంగానే ఊరంతా తిరిగి అన్నం అడిగింది....ఆమె మనసంతా చీరపైన్నే "అలాంటి చీరే

తనకుంటే" అనుకోకుండా ఉండలేకపోయింది...ఊరు తిరగడం పూర్తి చేసి అన్నం ఇంట్లో పెట్టి బట్టలు తీసుకరావడానికై మళ్ళీ ఊళ్ళో కెళ్ళింది—లక్ష్మీదేవి ఇచ్చిన సబ్బును చీరను తీసుకుంది — ఇండ్లన్నీ తిరిగి బట్టలు జమచేసుకొని ఇంటికొచ్చింది బట్టలన్నీ రెండు మూటలుగా కట్టింది—లక్ష్మీదేవి చీరను మాత్రం బయటనే వుంచింది... పరధ్యానంగానే అన్నం తిన్నది.... పరధ్యానంగానే భర్తకు వడ్డించింది—ఆమె ఆలోచనంతా చీరపైన్నే. భార్య పరధ్యానాన్ని గమనించాడు బాలయ్య. కారణ మడిగినా ఆమె చెప్పలేదు—చెరో బట్టల ముల్లెను తలకు తగిలించుకున్నారు—చీరను పుల్లమ్మ చేతిలోనే పట్టుకుంది. వీపులపై వున్న బట్టల బరువుకు వంగి ప్రక్క ప్రక్కగా చాకలి రేవు దిక్కు నడుస్తున్నారు భార్యా భర్తలిద్దరు.

మౌనంగా వున్న భార్య నుద్దేశించి "ఎట్లనో ఉన్నవేంద్రి?" అడిగాడు బాలయ్య — "ఏం లేదు నాకేమయింద్రి? మంచిగనే వుంటి" అంది పుల్లమ్మ "నాగ్గాకుంటెవ్వలకు సెప్పుతవు...దాసేదేంది సెప్పలేవు" అన్నాడు బాలయ్య.

తన కోర్కె గూర్చి భర్తకు చెప్పాలో వద్దో నిర్ణయించుకోలేకపోతుంది పుల్లమ్మ...చెప్పినా ప్రయోజనం శూన్యం. తమ బ్రతుకుల కద్ది చాలా విలువయిన కోర్కె—నెరవేర్చడం సాధ్యం కాదనుకుంది. అయినా భర్త పదే, పదే అడిగేసరికి "సెప్పేం ఫాయిదా? నువ్వేమన్నా ఆరుత్తావా? తీరుత్తావా"? అంది.

"నేనుగాకుంటే ఇంకెవ్వలు తీరుత్తరే. సెప్పనయితె సెప్పలేవు" అన్నాడు బాలయ్య తన చేతిలో వున్న దొరసాని చీరెను భర్తకు చూపెడుతూ "గిది లచ్చిందేవి దొరుసాని చీరె—గిదిన్ని సూసినప్పటి సుంది నా మనసు మనసులుంటలేదు—గిసోంటి దొక్క సీరే కొంటావా?" అంది మెల్లగా పుల్లమ్మ.

భార్య కోర్కె విని తన నిస్సహాయ పరిస్థితికి నవ్వుకున్నాడు బాలయ్య. తన పరిస్థితి కదెంత శక్తికి మించిన పనో అతనికి తెలుసు అందుకే భార్యతో 'ఏందనుకుంటన్నవు గా సీరంటే? దొరసాన్లు గట్టే చీరే నీగావన్నా? అది కొనన్నంటే ముస్నూరూప్పాలన్న గావాలె.... ఏన్నుంచత్తయి సెప్పు? పిచ్చి పిచ్చి ఆలోసన్లు పెట్టుకోకు.. అన్నాడు బాలయ్య ...

తన ఉత్సాహంపై చల్లని నీళ్లు చల్లినట్టు కాగా పుల్లమ్మ ముఖం వివర్ణముయింది.. తన కోర్కె దుస్సాధ్యమని తెలిసినా భర్త బలవంతం మీద చెప్పనందుకు బాధపడింది. భర్త మాత్రమేం చేస్తాడు...? తనకు సాధ్యమయ్యేదయితే తప్పకుండా తీర్చేవాడే అనుకుంది. చిల్లులు పడ్డ పూరిగుడిసెనైనా కప్పించుకోలేని తమలాంటి వాళ్ళేంటి...? చలువరాతి బంగ్లాలో నివసించే దొరసాని లాంటి వాళ్ళు కట్టే చీరను కట్టాలనుకోవ డమేంటి? అనుకుంది. ఆ కోర్కెను బలవంతంగనైనా సరే అనుచుకో వడానికే నిర్ణయించుకుంది. భర్త మాటలకేం సమాదాన మివ్వలేదు... మౌనంగా రేవు సమీపించారు. ముల్లెల నక్కడ పడేసారు. విప్పారు. బట్టలన్నీ నీట్లో నానేసారు ఈత బరిగెలు, తుమ్మ పొరకలతో పొయ్యి నంటుబెట్టారు. కుండలో నీళ్ళుపోసి అందులో బట్టలేసారు.... కుండను పొయ్యిపై పెట్టారు. మరో పొయ్యంటు బెట్టి దానిపై మరో కుండలో మిగతా బట్టలుంచారు పొయ్యిలు మండుతున్నాయి. కుండల్లోని బట్టలు కళ ఫెళ ఉడుకుతున్నాయి — కుండలోని నీళ్లు మురికితో జిడ్డుగా తయారౌ తున్నాయి. బండపై దొరసాని చీరవేసి సబ్బుతో రాస్తుంది పుల్లమ్మ. చీర నప్పురూపంగా తడుముతుంది. అ చీరను చూస్తుంటే, తాకుతుంటే ఆమెలో ఏదో ఆనందాన్ని కట్టుకోవాలన్న ఆరాటం. స్వంతం చేసు కోవాలన్న ఉబలాటం. అది సాధ్యం కాదని తెలిసినా ఆ చీరపై నుండి మనసును మరల్చుకోలేకపోతుంది — చాకిరేవు కొస్తూ భర్త మాటల తరు

వాత తన కోర్కెనణచుకోవాలని తీసుకున్న నిర్ణయం తన బలమయిన కోర్కెముందు వీగిపోయింది—ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. చీరను పిండి పచ్చగడ్డిపై ఆరేసింది. గాలి కెగిరి పోకుండా నాలుగు దిక్కులా చిన్న చిన్న రాళ్లు పెట్టింది. ఇద్దరు కలిసి మరికొన్ని బట్టలకు సబ్బురాసి ఉతికేసారు—తర్వాత కుండల్లోని బట్టలు తీసి బండల దగ్గరేసాడు. ఒక్కొక్కటి చేతులోకి తీసుకొని "హుష్ హుష్" అంటూ బండకేసి ఉతుకుతున్నారు. వాళ్ళ నోటినుండి వచ్చే ధ్వని, బండపై బట్టలు పడ్డప్పుడు వచ్చే ధ్వని లయబద్ధంగా వినబడుతున్నాయి... పనిలో ఎంత నిమగ్నమయినా పుల్లమ్మ మధ్య మధ్య లక్ష్మిదేవి చీర దిక్కే చూస్తూనే ఉంది. అలాంటప్పుడు లయబద్ధ ధ్వనికీ భంగం కలుగుతుంది—అప్పుడు బాలయ్య భార్య దిక్కే చూసి ఆమేం చేస్తుందో గమనిస్తున్నాడు. ఆమె చూపెక్కడుందో పరికిస్తున్నాడు.—బట్టలన్నీ ఉతికి పిండి ఆరేసారు అలసటగా గట్టుపై కూర్చున్నారు. హుషారుగా వుండే భార్య ముభావంగా ఉండటం గమనించాడు బాలయ్య. చీర గూర్చి మళ్ళీ భర్తతో చెప్పాలనుకుంటూ ప్రయోజనంలేదని విరమించుకుంటుంది పుల్లమ్మ. భార్యముఖంలో మారుతున్న రంగులను గమనిస్తున్నాడు—బాలయ్య తర్జన భర్జనను తిలకిస్తున్నాడు. భార్యకు చీరకొనిస్తానని వాగ్దానం చేసి తర్వాత కొనివ్వకుంటే బాగుండదని ఆ ప్రస్తావన తేవద్దని ఊర్కున్నాడు. కొంత సేపు విశ్రాంతి తీసుకొని స్నానం చేసారు. చెమట మురికి కంపును కడుక్కున్నారు. ఒడ్డుకొచ్చి బట్టలు మార్చుకున్నారు. విడచిన బట్టలుతికి ఆరేసారు. ఎండిన బట్టలన్నీ ఒక్కొక్కటే మడత పెడ్తున్నారు. కొన్ని బట్టలొకమూటగా, ఇంకొన్ని మరోమూటగా కట్టారు. మూటలు తలలకు తగిలించుకొని ఊరు దిక్కే నడుస్తున్నారు. పుల్లమ్మ చీరపై వాంఛను వద్దనుకుంటూనే పెంచుకుంటూ, బాలయ్య భార్య నా కోర్కె నుండి దూరం చేయడానికేం చెయ్యాలో ఆలోచిస్తూ—

ఇల్లా చేరుకున్నారు? కొంత సేపు మౌనంగా గుడిసెలో కూర్చున్నారు—
లేచి ఇద్దరూ అన్నం తిన్నారు బట్టలు ఊళ్ళో ఇచ్చి రావడానికెళ్ళారు.
పొద్దు గూట్లో పడే వేళన బట్టలన్నీ పంచారు. లక్ష్మీదేవి చీరను ఇస్తు
న్నప్పుడు పుల్లమ్మ తన పెన్నిధి ఏదో పోయినట్టుగా లోలోపలే భాధ
పడింది. ఇద్దరూ ఇంటికొచ్చారు. భార్య మౌనం బాలయ్యను బాదిస్తుంది
రేపటి వరకదే మారుతుందనుకుంటూ ఓంకెడంత కల్లు తాగొస్తానని
భార్యతో చెప్పి తాళ్ళ దిక్కెళ్ళాడు పుల్లమ్మ చీర గూర్చే అలోచిస్తూ
గంటపైగా గడిపింది— తర్వాత ఊళ్లోకెళ్ళి అన్నంతో తిరిగొచ్చింది .
ఈలోగా బాలయ్య తాళ్ళనుంచి తిరిగొచ్చాడు. ప్రక్కప్రక్కనే కూర్చొని
భార్యాభర్తలిద్దరు అన్నం తిన్నారు. తర్వాత ఇంట్లో ఉన్న ఒకే నులక
మంచంలో ఇద్దరూ పడుకున్నారు ఆప్యాయంగా భార్యపై చేయివేసాడు
ఆమె శరీరంలో ఏ వేడిలేదు—మంచుగడ్డలా చల్లగా వుంది...తన దిక్కు
తిప్పుకున్నాడు. యాంత్రికంగా భర్త దిక్కు తిరిగింది పుల్లమ్మ ఆరాత్రి
గడిచింది—మరెన్నో రాత్రులు గడిచాయి. పుల్లమ్మలో మునుపటి ఉత్సా
హం లేదు. భర్త నిబ్బంది పెట్టగూడదని తన కోర్కె నణచుకోవాలను
కున్నా రోజు రోజుకూ ఆ కోర్కె బలీయమై ఆ చీర కట్టుకోంది తన
జీవితమే వృధా అని తలుస్తుంది. భార్య పరిస్థితిని చూస్తున్న బాలయ్య
తన ఎముకలు కలికలి అయ్యేంత వరకైనా సరే కష్టపడి డబ్బు సంపా
దించి భార్యకా సీర కొనాలని నిర్ణయించుకున్నాడు—భార్యను దగ్గరకు
తీసుకొని తలనిమురుతూ...

"ఆ చీరె కోసమూకె రంది పెట్టుకోకు ఇది లగ్గాల కాలము. రెన్నెల్ల
దాక రొండు మూడు దినాలకో లగ్గముంటది...పల్లకి మోసి. పయినాలు
సేసి పైసలు సంపాయిత్త నీకు చీరెకొంట సరేనా"? అన్నాడు.

భర్త మాటలు విన్న పుల్లమ్మ ముఖంలో జ్యోతుల వెలుగు—
ఆ రాత్రి భర్త కౌగిట్లో మైనంలా కరిగిపోయింది. ఒకరిలో ఒకరు సం

పూర్ణంగా లీనమైపోయారు...

....   ...

భార్య కోర్కె తీర్చడానికెంత శ్రమైనా చేయడానికి నిర్ణయించుకున్నాడు. పల్లకీలు మోసాడు .. పయనాలు చేసాడు . కట్టెలు కొట్టాడు, దొరికిన కూలి పనల్లా చేసాడు. భర్త ఇతర పనుల్లో లీనమవడం వల్ల బట్టలుతికే పనిభారం పుల్లమ్మ ఒక్కదాని పైన్నే పడ్డా ఆమె చిరునవ్వుతో స్వీకరించింది. ఒళ్లు హూనం చేసుకొని రెండు నెలల్లో మూడు వందల రూపాయలు కూడబెట్టగలిగాడు బాలయ్య. భార్యకోర్కె తీర్చడ్డానికతడు పడ్డ కష్టం కష్టంగా కనపళ్ళేదు, భార్యకు డబ్బు చూపి మురిసిపోయాడు. తన కొరకు భర్త పడ్డ పాట్లను చూసిన పుల్లమ్మ కళ్లు చెమర్చాయి ..అతని కౌగిట్లో గువ్వలా ఒరిగింది. అసాధ్యమనుకున్న తన కోర్కె నెరవేరబోతున్నందుకు అమితానంద పడ్డది. తన నాచీరలో ఊహించుకుంటూ కలలు కంది. తెల్లవారి ఆ చీర వివరాలు తెలుసుకొని కొనుక్కురావడానికై పట్నం పోయాడు బాలయ్య. బట్టలూళ్ళో పంచొచ్చి సాయంత్రం భర్త రాక కొరకై ఎదిరి చూస్తుంది. క్షణమో యుగంలా గడుస్తుందామెకు___బజారులో భర్త కొరకై చూస్తున్న పుల్లమ్మ వట్టిచేతుల్తో వస్తున్న బాలయ్యను చూసి నిరుత్సాహపడ్డది జేబులో డబ్బు తీసి భార్య చేతిలో పెట్టి ఇంట్లోకి నడుస్తూ "ఆ చీరే ధర రొండేండ్లక్రింద ముస్నూరుండేనట. ఇప్పుడైదు నూర్లట" అంటూ వాల్చున్న మంచంలో కూలబడ్డాడు బాలయ్య. తన ఊహాసౌధం పూర్తిగా నిర్మాణం కాకముందే కూలిపోగా పుల్లమ్మ "పోనియ్ తియ్ మనకది బాకీ లేదు" అని బాధనణచుకుంటూ అంది. "ఇంకా నెలాగు, కూలి కింది కచ్చే బత్తె మస్తది. అచ్చిన అడ్లు, మక్కలమ్మి తప్పకుండ చీరె కొనుక్కత్త నువ్వు బుగులు పడకు" అని భార్యనోదార్చాడు భర్త అనురాగానికి సంతోషించి అన్నం వడ్డించింది పుల్లమ్మ.

నెల రోజులు ఇట్టే గడిచిపోయాయి. వాళ్ళకు రావల్సిన కూలి గింజలూ వచ్చేసాయి. వాట్నమ్మి డబ్బు తీసుకెళ్ళి చీర తేవాలనుకుంటు న్నాడు బాలయ్య...కాని ఇంతలో హటాత్తుగా జబ్బు పడ్డాడు. కడుపులో తీవ్రమైన నొప్పి భరింపరాని బాధ. ఊళ్లో వున్న డాక్టర్‌కు చూపి మం దులు తీసుకున్నా నొప్పి తగ్గడం లేదు...తన వల్ల కాదనీ పట్నం తీసు కెళ్ళి ఆపరేషన్ చేయందే ఆ నొప్పి తగ్గదని చెప్పాడు డాక్టర్—ఇక బాలయ్యను పట్నం తీసుకపోక తప్పలేదు. డాక్టర్ చేసిన ఆపరేషన్‌వల్ల బాలయ్య ప్రాణాలయితే దక్కాయి కాని పుల్లమ్మ చీర కొరకై ఒళ్ళు హూనం చేసుకొని కూడ బెట్టిన డబ్బు, ధాన్యం అంతా ఖర్చయింది.... పోగా మరో నాలుగువందలప్పయింది. భర్త ప్రాణాలు దక్కినందుకు కనబడని దేవుని కళ్లా మొక్కుకుంది పుల్లమ్మ. భార్య చీర కొరకై కూడ బెట్టిన డబ్బు తన రోగానికి ఖర్చయినందుకు తెగ బాధపడ్డాడు బాలయ్య. భార్య కొర్కె తీర్చలేక పోయినందుకు తీవ్ర ఆవేదన చెం దాడు. భార్యతో తన బాధను వ్యక్తం చేసాడు. తన కిప్పుడు చీర మీద మోజు లేదని, ఆ చీర గూర్చి ఆలోచించవద్దనీ వేడుకుంది భర్తను. భర్త అనారోగ్యం హడావిడిలో పుల్లమ్మ ఆ చీర గురించే మర్చిపోయింది... ఇపుడామెకా ఆలోచనే లేదు. కొద్ది రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఆ చీర గూర్చి పూర్తిగా మర్చిపోయారు ...

నాలుగైదు నెలల తర్వాత మళ్ళీ ఆ చీర ఉతకడానికి వేయబడింది. చెర్లో ఉతికి ఇంటికి తెచ్చింది పుల్లమ్మ...పాతజ్ఞాపకాలు మదిలో మెదిలాయి. అచీరను కట్టుకోవాలన్న కోర్కె కలిగింది చీరను ఒంటిపై కప్పుకొని మురిసిపోయింది—చుట్టుకొని చూసింది ... అంచులను తడిమి తడిమి చూసింది. చూస్తున్న కొద్దీ కోర్కె మరింత బలీయమైపోయింది తానెలాగూ ఆ చీరను కొని కట్టుకోలేదు అది తన వల్ల సాధ్యంకాదని తేలిపోయింది—"కనీసం ఒక్క రోజు కొరకైనా ఆ చీరను కట్టుకుంటే"

అనుకుంది అమ్మో దొరసాని చీరను కట్టుకోవడమే. దొరకు తెలిస్తే ఇంకే మన్నుందా"? అని భయపడింది. అయినా ఒక్కసారైనా ఆ చీరను కట్టుకోవాలన్న కోర్కె నణచుకొలేకపోయింది.

"ఒక్కరోజు కట్టుకుంటే మునిగిపోయేదేముంది? ఆ చీరను కట్టుకొని దొరింటి దిక్కు పోకుంటే సరిపోతుంది. రేపు భర్తనే బట్టలకు తోలితే చాలు" అని ఆలోచించిది. "ఎవరన్నా చూసి చెపితే— ఎవరికేం పని" చూసి ఎందుకు చెప్తారు"? అన్ని రకరకాలుగా తర్కించుకుంది. "ఒకవేళ దొరకు తెలిసి తిట్టినా మౌనం వహించాలి" అనుకుంది. చీర కట్టుకొని భర్తకెదురెళ్ళింది ఊరు తిరిగొచ్చిన బాలయ్యా భార్య కట్టుకొన్న చీరను చూసి ఆశ్చర్యంపోయాడు — భార్యను మందలించాడు. కాని భార్య ముఖంలోని సంతోషాన్ని చూసి విడువమనలేక పోయాడు. ఆ రాత్రి ఆ చీరలో వున్న పుల్లమ్మ తనలో సంపూర్ణంగా లీనమైతే పరవశం చెందాడు...తెల్లవారి చీరను విడవమన్నాడు. చాకలి రేవుకు పెళ్ళింతరువాత విడిచి ఉతుకుతానంది పుల్లమ్మ దొరింటికి తానే బట్టలు తేవడానికెళ్ళాడు. లక్ష్మిదేవి చీర గురించడిగితే సాయంత్రం తెస్తానన్నాడు.

కాపువాడ తిరిగి ఇంటికి పోబోతున్న పుల్లమ్మ దగ్గరికొచ్చి సుంకరి "దొర నిన్ను రమ్మంటున్నాడు. అని పెళ్ళిపోయాడు. పుల్లమ్మకు పరిస్థితర్థమయింది—భయపడుతూ దొరింటి కెళ్ళింది. పెద్దరువాజ దాటి వాకిట్లోకెళ్ళింది. ఇంట్లో ఏ అలికిడీ లేదు. పిల్లలు బడికెళ్ళారు.లక్ష్మీదేవి పోలీస్ పటేలింటికెళ్ళింది. బెదిరి-బెదిరి చూస్తూ అరుగెక్కింది. దొరను చూసి పులిని చూసిన లేడి పిల్లలా గజగజా వణికిపోయింది .. పుల్లమ్మ కట్టిన చీర దిక్కూ, ఆమె శరీరం దిక్కూ ఆకలిగా చూస్తున్నాడు— "దొరా తప్పయింది బాంచెను ఈ తాప కట్టుకోను,, అని కాళ్ళపై బడింది. "దొరసాని చీరె గడ్తావే అయితే నువ్వు నాకు ఏమైతవ్—"?అని కపట నవ్వు నవ్వి పుల్లమ్మ జబ్బలు పట్టుకొని లోపలికి తీసుకెళ్లాడు. ఆతని

చేయి మీద పడగానే తేళ్లు, జెర్లు పాకినట్టుగాగా గింజుకుంది ఏడ్చింది. మొత్తుకుంది. తనను ఏం చేయవద్దని దీనంగా వేడుకుంది ఆమెఏడ్పులు అరుపులు. పెడబొబ్బలు ఎకరం వైశాల్యంలో కట్టబడున్న ఆ ఇంట్లో అరణ్యరోదనమే అయ్యాయి...

అణచుకోలేని అతి చిన్న కోర్కె కారణంగా ఓ క్రూర మృగం అమానుష కామదాహానికి బలియై జీవచ్ఛంలా బయటకొచ్చింది. ఇంటి కెళ్ళి భర్తను పట్టుకొని కన్నీరు మున్నీరుగా ఏడ్చింది భార్యాభర్తలొకర్నొకరు పట్టుకొని తనవి తీరా ఏడ్చారు.

కన్నీరింకిపోయే వరకూ దుఃఖించిన వాళ్ళ ముఖాల్లో ఓ దృఢ నిర్ణయం కొట్టొచ్చినట్టగుపడుతుంది వాళ్ళ ముఖాల్ని పరిశీలించి చూస్తే అన్యాయానికి బలియై మౌనంవహించే వారిలా కనబడటం లేదు తామెంత బలహీనులైనా తమకు జరిగిన అన్యాయాన్నెదుర్కోవాలనే దీక్ష ద్యోతకమవుతుంది....